


చెరువులా మారిన తిరుచానూరు రోడ్డు

ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుచానూరు బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్నా రోడ్లు చెరువులా మారుతున్నాయి. వాహనాల రాకపోకలతో అధ్వానంగా మారింది. తిరుచానూరు ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు చెరవును తలపిస్తోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇకనైనా టీటీడీ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



నగర అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ

గృహ నిర్మాణాలు, మాస్టర్‌ప్లాన్ రోడ్లపై నిత్యం పరిశీలిస్తున్న కమిషనర్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: **తిరుపతి అభివృద్ధిపై కమిషనర్ అనుమాప అంజలి ప్రత్యేక శ్రద్ధపెట్టారు. కార్పోరేషన్ పరిధిలో జరుగుతున్న గృహనిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. తిరుపతి నగరంలో ఉన్న సుమారు 25వేల మందికి పట్టాలు ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందులో వడమాలపేట, జీపాళ్యెం, కొత్తపల్లి, చిందేపల్లి, సూరప్పకేశం వంటి ప్రాంతాల్లో గృహనిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులు వేగవంతంగా జరిగేందుకు కమిషనర్ అనుపమా అంజలి ప్రతిరోజు వాటి సమీక్షలు నిర్వహించడం కాకుండా నిత్యం జరుగుతున్న పనులను సమీక్షసమావేశాలు నిర్వహిస్తున్నారు.**

అవసరమైతే వారంలో రెండు రోజులు గృహనిర్మాణా పనులు ఎలా జరుగుతున్నాయే వాటిని ప్రత్యక్షంగా పరిశీలిస్తు, సిబ్బందికి సలహాలు సూచనలు జారీచేస్తున్నారు. వచ్చేనెల 15తేదీ లోపు గృహనిర్మాణపనులు 90శాతం పనులు పూర్తిచేయాలని నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రక్టర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రతి రోజు హౌసింగ్ అధికార్లు, వార్డు అడ్మిన్లుతోపాటు మున్సిపల్ డిఇలు క్షేత్రస్తాయిలో పనులు చేసేవిధంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. వారంలో ఒకరోజు జిల్లాకలెక్టర్ సమీక్షలో కూడా గృహనిర్మాణ పనులపై కమిషనర్ కలెక్టర్‌కు నివేదికను అందజేస్తున్నారు. వీటితోపాటు తిరుపతి ట్రాఫిక్ సమస్య పరిష్కరం కోసం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి 12రోడ్లను విస్తరించాలని సూచించారు. కౌన్సిల్‌లో కూడా దీన్ని ఆమోదించారు. కమిషనర్ ప్రతిరోజు రోడ్ల విస్తరణపనులు ఎలా జరుగుతున్నాయే క్షేత్రస్థాయిలో పర్యటించి అక్కడ ఉన్న సాదకబాధలు తెలుసుకుని వాటి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లు పూర్తి అయితే తిరుపతి నగరానికి కొంత వరకు ట్రాఫిక్ నివారించే అవకాశం ఉంది. మాస్టర్‌ప్లాన్ రోడ్లకు ఉన్న అడ్డకులను కమిషనర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకోని వాటిని పరిష్కరించేలా చేస్తున్నారు. తిరుపతి స్మార్టుసిటి పథకంలో జరుగుతున్న అభివృద్ధిపై కూడా కమిషనర్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారు. స్మార్టుసిటి పనులు ఎప్పటికప్పడు సమీక్షలు నిర్వహించి త్వరగా పనులు చేసేందుకు ఇటు కౌన్సిల్, అటు అధికార్లను సమన్వయం చేసుకోని ముందుకుపోతున్నారు. నగరంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేకచర్యలు చేపట్టారు. నగరంలో ఫాగింగ్‌తోపాటు, కాలువలలో పిచ్చికారి చేయించి అంటువ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య అధికార్లకు కమిషనర్ అనుపమ అంజలి ప్రత్యేక చర్యలు చేపట్టారు. తిరుపతి అభివృద్ధి చేయడమే తన కర్తవ్యంగా కమిషనర్ పాలన చేస్తున్నారు. పాలనతోపాటు మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయం పెంచుకునే మార్గాలపై దృష్టిపెట్టి ఆస్తి, నీటి, యుడిఎస్, ప్రకటన పన్నులతోపాటు ఇతరపన్నులు వసూళ్లకు చర్యలు చేపట్టారు. టిటిడి నుంచి రావాల్సిన బకాయిలపై ఉన్నతధికార్లుతో సంప్రదించి కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు తెప్పించుకుంటున్నారు.

జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేసిన పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి రోజా

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: రాష్ట్రపర్యాటక సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సజనాత్మక మరియు సంస్కృతి సమితి వారిచే జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు పెద్దఎత్తున జరపబోతున్నట్లు, అలాగే క్రీడాశాఖ తరపున వివిధ క్రీడల పోటీలు జోనల్ రాష్ట్రస్థాయిలో జరప బోతున్నామని అలాగే పోటీలో విజేతలకు బహుమతులు ముఖ్యమంత్రి జన్మదినాన విజేతలకు అందచేయబోతున్నట్లు తెలుపుతూ జగనన్న మన రాష్ట్ర యూత్ ఐకాన్ అని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖా మంత్రి ఆర్‌కే.రోజా అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక బ్లిస్ హోటల్‌లో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలకు సంబంధించిన పోస్టర్లను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ జోనల్‌స్థాయి పోటీలు తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం కేంద్రంగా రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు డిసెంబర్ 19,20 తేదీలలో నిర్వహించబడతాయని తెలిపారు. తిరుపతి జోన్‌కి సంబంధించి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల కళాకారులకు మహతి కళాక్షేత్రంలో నవంబర్19, 20, 21 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. గుంటూరు జోన్ లోని ప్రకాశం పల్నాడు, బాపట్ల, గుంటూరు, యన్.టి.ఆర్ కష్ణాజిల్లాల కళాకారులకు నవంబర్ 24, 25, 26 తేదీలలో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నందు నిర్వహిస్తున్నట్లుతెలిపారురాజమండ్రి జోన్ లోని ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కళాకారులకు నవంబర్ 29,30 డిసెంబర్ 1 తేదీలలో శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం జోన్‌లోని అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కళాకారులకు డిసెంబర్ 7,8,9 తేదీలలో ఉడా చిల్డ్రన్స్ థియేటర్లో జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 19, 20 తేదీలలో తుమ్మలపల్లి కళాక్షేత్రం విజయవాడలో నిర్వహింపబడునని తెలిపారు. సాంప్రదాయ నత్యాలలో కూచిపూడి నత్యం, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, గొత్రం (సింగింగ్) జానపద కళారూపాలు డప్పులు, గరగలు, తప్పటగుళ్ళు చెక్కభజన పులివేషాలు, బుట్టబొమ్మలు, కాళికా వేషాలు, ఉరుములు మరియు గిరిజన కళారూపాలైన ధింసా, కొమ్ముకోయ, సవర, లంబాడీ తదితర కళారంగాల్లో జోనల్ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించబడునని ప్రతివిభాగంలో జోనల్ స్థాయి విజేతలకు గ్రూపు కు రూ.25,000లు సోలోకి రూ.10,000లు, రాష్ట్రస్థాయి విజేతలకు గ్రూపుకి లక్ష రూపాయలు, సోలోకి యాభై వేలు గౌ ముఖ్యమంత్రి జన్మదినాన అందచేయ నున్నట్లు తెలిపారు. ఆసక్తి గల కళాకారులు నవంబర్ 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలనికోరారు. సాంస్కృతిక క్రీడా శాఖా మంత్రిగా వివిధ క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జగనన్న పుట్టిన రోజున బహుమతులు అందచేసేవిధంగా పోటీలు నిర్వహించేందుకు రూ.50లక్షలు కేటాయించి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జిల్లా జోనల్ రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తామని గెలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో మంచి బహుమతులు అందచేస్తామని అలాగే జగనన్న పుట్టిన రోజు వేడుకలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈడి, రీజినల్ డైరెక్టర్ పర్యాటకశాఖ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్ర నాథ్‌రెడ్డి సెట్విన్ సీఈవో మురళి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో అదృశ్యమై ఆగ్రాలో ప్రత్యక్షం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలో ఈనెల 9న అదశ్యమైన ఐదుగురు విద్యార్థులు ఆగ్రాలో ప్రత్యక్షమయ్యారు. పోలీసుల కథ మేరకు.. తిరుపతి నెహ్రూనగర్‌కు చెందిన మోహిత, మోనీస్వరి, గుణశ్రీ, బాలాజీ, అబ్దుల్ రహమాన్, అదీప్, అన్నమయ్య స్కూల్లో చదువుకుంటూ ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం ట్యూషన్‌కు వెళ్లి అదశ్యమైన విషయం విధితమే. వీరిపై తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి వెస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసినారు. తిరుపతి నగరంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఇతర ప్రాంతాల్లోని పోలీసులకు సైతం విద్యార్థులు ఫోటోలను పంపి ఆచూకీ తెలపాలని సూచించారు. పోలీసుల శ్రమ ఫలించింది. తిరుపతిలో తప్పిపోయిన విద్యార్థులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో ఉన్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. దీంతో వెస్ట్ ఎస్ఐ మరో కొంతమంది కానిస్టేబుళ్లు హుటాహుటిన విమానం ద్వారా ఆగ్రాకు పయనమయ్యారు. పోలీసుల వారిని తీసుకొని సోమవారం తిరుపతికి రానట్లు సమాచారం. విద్యార్థులు ఇంటిలో నుంచి అలిగి వెళ్ళారా, ఆగ్రాలోని తాజమహల్ చూడాలని కోరిక మీద వెళ్లారా, వీరికి ఎవరైనా సహకరించారా, తదితర వివరాలు ఆగ్రాకి వెళ్ళిన పోలీసులు తిరిగి వచ్చాక తెలియాల్సి ఉంది.

ప్రొఫెసర్ పద్మజ మునస్వామికి ఘనసన్మానం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వైద్యరంగంలో విశేషసేవలు అందించిన డాక్టర్ పద్మజ మునస్వామికి 2020 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్మి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా ఆదివారం తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనసన్మానం జరిగింది. స్థానిక గెస్ట్‌లైన్ డేస్ హోటల్లో జరిగిన ఓకార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ జితేంద్ర అనేజ మాట్లాడుతూ డాక్టర్ పద్మజ మునస్వామి డాక్టర్‌గానే కాక సామాజిక రంగంలోను మంచి కషిచేశారని, క్యాన్సర్ నిరోధకానికి మహిళలను చైతన్య పరచడంలో ప్రశంసనీయమైన పాత్రపోషించారని అన్నారు. వైద్యరంగంలో పద్మజ కషి శ్లాఘనీయమని అన్నారు. డాక్టర్ ఉమాపతి, డాక్టర్ ఎస్ఎన్.సమిత, సోంప్రకాష్, డాక్టర్ మునస్వామిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ నైనారు మధుబాల

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నేటితరానికి గ్రంథాలయాల ప్రాముఖ్యత, సేవలను తెలియజేసే విధంగా ఈనెల 14 నుంచి 20వరకు జిల్లాలోని 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ నైనారు మధుబాల, కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బైరాగిపెట్టెడలోని ప్రభుత్వశాఖా గ్రంథాలయం తిరుపతి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈనెల 14 నుంచి 20వరకు జిల్లాలోని అన్ని గ్రంథాలయాలలో రోజువారిగా ఈక్రింద విధంగా కార్యక్రమాలు నిర్వహించబడునని పేర్కొన్నారు. 14 గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు, 15 పుస్తక ప్రదర్శన, 16 గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న వారిని స్మరించుకొనుట, 17 కవి సమ్మేళనం, 18 విద్యార్థులకు వివిధరకాల పోటీలు నిర్వహించుట, 19 గ్రంథాలయా వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం, 20 గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ప్రముఖులచే విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల ప్రాధాన్యం సామాజిక స్పహ, విద్య ప్రాధాన్యతను చాటి చెప్పేలా ఈ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్, నైనారు మధుబాల తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలలో అందరూ పాల్గొని ఈ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవతం చేయాలని కోరారు.

విద్యార్థులకు సైన్సు

పరిశోధనలు అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు విజ్ఞానంతో పాటు సైన్స్‌ని అభివద్ధి చేసుకునే దిశగా అనేక పరిశోధనలను ఆవిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరుపతి జిల్లా విద్యాధికారి డాక్టర్ వి.శేఖర్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సైన్స్ ప్రదర్శనశాలను నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తిరుపతి చుట్టుప్రక్కల అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు ఎంతో చక్కటి మోడల్స్‌తో ఈ సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పుస్తకాల్లోని పరిజ్ఞానాన్ని, సైన్స్ పరిజ్ఞానాన్ని మోడల్స్ రూపంలో తయారు చేయడం నిజంగా అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థులు అందర్నీ ఒక చోటికి చేర్చి సైన్స్ పరిశోధనలు, మోడల్స్ అందరికీ చూసే విధంగా ఏర్పాటు చేయడం పట్ల ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం అధికారులను అభినందించారు. ఇటువంటి సైన్స్‌ఫెయిర్లు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లోని సజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. బాలోత్సవ్ కోశాధికారి పి.గురునాథం మాట్లాడుతూ పాఠశాల తరగతులలో చదివే విద్యార్థులకు విశేషమైన సైన్స్ పరిజ్ఞానం ఉండడం ద్వారా దానిని వెలికిలేకి తీసేందుకు ఇటువంటి సైన్సుప్రదర్శనలు ఎంతో ముఖ్యమైనవని వెల్లడించారు. విద్యార్థులకు సైన్స్‌రంగం పట్ల ఆసక్తిని కలిగించేందుకు ఇవి ఎంతో కషి చేస్తామన్నారు. ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి ఎన్నో అంశాలు ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. విద్యార్థులు ఎప్పుడైనాగానీ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలోని అంశాలలో పరిజ్ఞానం పెంపొందించుకొని మోడల్స్‌ను తయారు చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ అధ్యక్షకార్యదర్శులు, సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



సైన్స్ ప్రదర్శనశాలలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

లయన్స్ క్లబ్ సెవెన్ హిల్స్ అధ్యక్షులుగా ఆర్కాట్ కృష్ణప్రసాద్

లయన్స్ క్లబ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఏర్పాటు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి రెనెస్ట్ హోటల్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సేవా సంస్థ లయన్స్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థగా లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌కు వ్యస్థాపక అధ్యక్షులుగా ఆర్కాట్ కష్ణప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు వినుత ప్రకాష్, భానుమూర్తి రెడ్డి, భక్తవత్సలరెడ్డిలు ముఖ్యఅతిధులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ వినుతప్రకాష్ మాట్లాడుతూ సుమారు 156 దేశంలో ప్రముఖ సేవాసంస్థగా పేరుగాంచిన లయన్స్ ఇంటర్నేషనల్ దినదినాభివద్ధి చెందుతూ అనాధలకు, ఆశ్రమాలకు, పేదవారికి వివిధ రూపాలలో సేవలు అందిస్తుందని తెలిపారు. తిరుపతి సేవాసైనికుడుగా పేరు తెచ్చుకున్న ఆర్కాట్ కష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటైన లయన్స్‌క్లబ్ అఫ్ సెవెన్‌హిల్స్ విజయపథంలోకి తీసుకెళ్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తరువాత లయన్స్ ఇంటర్నేషనల్ ఐఎంసిసి భానుమూర్తిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం లో నెం.1 సేవా సంస్థగా లయన్స్ ఇంటర్నేషనల్ వెలుగొందుతుందని చెప్పారు. తరువాత లయన్స్‌క్లబ్ ఆఫ్ సెవెన్ హిల్స్ కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ పేదప్రజలకు సహాయం చేయడం లయన్స్ క్లబ్ ముఖ్యఉద్దేశమని తెలిపారు. తరువాత లయన్స్ ఇంటర్నేషనల్ జెడిసి.మక్కిన భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి, మానసిక వికలాంగుల కేంద్రం పాస్‌కు నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. నూతన క్లబ్‌కార్యదర్శిగా వి.జగన్నాధం, కోశాధికారిగా విష్ణు ప్రసాద్, ఉపాధ్యక్షులుగా శంకర్, డాక్టర్ మధుసూదన్‌రావు, అంతరాజి అనిల్, అడ్మిన్‌గా సురేష్‌బాబు, కోలా లక్ష్మీపతి, రఘుపతి, బెల్లంకొండ సురేష్, డాక్టర్ దామోదరం, ఆకుల రమణమూర్తి, రామారావు, జయంతి, మోహన, కష్ణయ్య, పసుపులేటి సురేష్, శ్యాంబోలు హరినాథ్, డార్నిక్, హేమచంద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ తిరుపతి అధ్యక్షులు మునికష్ణమ నాయుడు, కార్యదర్శి చిత్రమోహన్, కోశాధికారి ముబారక్, మేరీ, మబ్బు సూర్యనారాయణ రెడ్డి, లోకేష్‌బాబు, చంద్రన్, కస్పా పద్మనాభం లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు డేవిడ్ అబ్రహం, జ్యోతి రామన్, రాజేంద్ర ప్రసాద్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్లల్లో 'జగన్మోసం'



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్, జగనన్న కాలనీలో మోసం జరుగుతోందనీ, పేదలకు కట్టిస్తున్న ఇళ్ళన్నీ నాసిరకంగా ఉన్నాయని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంఛార్జి వినుత కోటా ఆరోపించారు. 'జగనన్న ఇళ్లు- పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె జనసేన నాయకులతో కలిసి ఊరందూరు, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలను పరిశీలించారు. ఊరందూరు వద్ద 25 వేల ఇళ్ళ పట్టాలిస్తే ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదని వాపోయారు. ఇళ్ళ నిర్మాణాలను కాంట్రాక్టర్లకు అప్పగించగా పునాదులు భూమి పైనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. చాలా వరకు ప్రారంభించిన ఇళ్లు పునాదుల వరకే ఒక్క అడుగు మాత్రమే పొడవుతో ఉన్నాయనీ, కొన్ని మొండి గొడలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్ వద్ద 1900 ఇళ్ల పట్టాలిస్తే ఒక్క ఇళ్లు కూడా పూర్తి కాలేదనీ, 6 వేల టిడ్కో ఇళు దాదాపు పూర్తి అయినా కానీ లబ్ధిదారులకు అందజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొదట విడతలో 12 వేల ఇళ్ళు పూర్తి కావలసి ఉండగా 100 ఇల్లు కూడా పూర్తికాలేదని మండిపడ్డారు. దండి రాఘవయ్య, కిరణ్ కుమార్, గోపి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను పరిశీలించిన జనసేన నాయకులు

తిరుపతి సిటీ: జనసేన పిఏసి సభ్యులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నగర అధ్యక్షులు రాజరెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గం తొండవాడ గ్రామంలో వైసీపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న టిడ్కో ఇళ్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా పేదల కలైన ఇంటి నిర్మాణ పనులను నత్తనడక సాగుతున్నాయని, చిత్తశుద్ధితో సకాలంలో పూర్తిచేసి ఇవ్వాల్సిందిపోయి ఇంటి పనులను గాలికొదిలేశారని విమర్శించారు.



తిరుపతిలో..

జిల్లా రేషన్ డీలర్ల

అధ్యక్షులుగా సోమశేఖర్ రెడ్డి ఎన్నిక



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా సోమశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్లో రేషన్‌డీలర్ల సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు హాజరయ్యారు. ఈఏడాది ఏప్రిల్ నాలుగో తేదీ కొత్తజిల్లాలు ఏర్పడ్డాయి. తిరుపతి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా సోమశేఖర్‌రెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శిగా చక్రవర్తిరెడ్డి కోశాధికారి లక్ష్మణరావు ఉపాధ్యక్షుడు నరేష్‌ను ఎన్నుకున్నారు. దీంతో పాటు కమిటీ సభ్యులు కూడా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రేషన్‌డీలర్ అసోసియేషన్ అధ్యక్షులుగా నియమితులైన సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రేషన్‌డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషిచేస్తానని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ డీలర్లకు జీతాలు ఇస్తున్నారని అలాగే వారికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండ దండాలు అందిస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్లో కూడా రేషన్ డీలర్లకు న్యాయం జరిగేందుకు తన వంతు కషి చేస్తానన్నారు. తనను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

శ్రీవారి స్నపన తిరుమంజనం



ప్రజాశక్తి- తిరుమల: కార్తీక వనభోజనం సందర్భంగా ఆదివారం తిరుమలలోని వైభవోత్సవ మండపంలో శాస్త్రోక్తంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తీకమాసంలో పార్వేటి మండపం వద్ద కార్తీక వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కానీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కార్తీక వనభోజనాన్ని టీటీడీ రద్దు చేసింది. అయితే వైభవోత్సవ మండపంలో స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి17 వరకు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈనెల 14 నుంచి 17 వరకు తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖామంత్రి ఈనెల 14వ తేదీ గన్నవరం విమానాశ్రయం నుండి రాత్రి 7.15గంటలకు బయలుదేరి 8.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుండి రోడ్డు మార్గాన బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరుమల చేరుకొని అక్కడే రాత్రి బస చేస్తారు. ఉదయం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకొని సాయంత్రం 3.30 గంటలకు తిరుమల నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.30లకు తిరుపతి చేరుకుని హోటల్ గ్రాండ్ రిడ్జ్‌లో రాత్రి బసచేస్తారు. 16వ తేదీ ఉదయం 10.30కు స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని పిఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రాయలసీమ జిల్లాల రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో సాయంత్రం 5.15గంట వరకు పాల్గొని గ్రాండ్ రిడ్జ్‌లో రాత్రి బస చేసి 17వ తేదీ ఉదయం 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి బయలుదేరి విశాఖపట్నంనకు తిరుగు ప్రయాణం కానున్నారని ఆ ప్రకటనలో తెలిపారు.

బయోకెమిస్ట్రీ కార్యశాల బ్రోచర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే కార్యశాల బ్రోచర్‌ను ఎస్వీయూ ఉప కులపతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యశాల "కరెంట్ ట్రెండ్స్ ఇన్ బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ " అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు కార్యశాల కన్వీనర్ డాక్టర్ ఎం. బాలాజీ వెల్లడించారు. వీసీ ఆచార్య కె రాజారెడ్డి విద్యార్థులకు అవసరమైన వర్క్ షాపులు, కార్యశాలలు, సదస్సులు, ఓరియంటేషన్ శిక్షణ తరగతులు వంటివి నిర్వహించడం అధ్యాపకుల బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఆచార్య ఓవియస్ రెడ్డి, ఆచార్య డివియస్ మూర్తి, డా. బాలాజి పాల్గొన్నారు.

వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హిందీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ విభాగపు అధ్యక్షులు డాక్టర్ నారాయణ మార్గదర్శకత్వంలో "సుశీల టాక్ భౌరే కే సాహిత్య మే దళిత నారీ సంఘర్ష" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల హిందీ విభాగపు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నాడు-నేడు పనులకు భూమిపూజ



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పదో వార్డులోని ఎల్‌ఏ సాగరంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.16 లక్షలతో ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ కటకం దీపికా ఆధ్వర్యంలో నాడు-నేడు పనులకు భూమిపూజ చేపట్టారు. సూళ్లూరుపేట శాసనసభ్యులు, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య పనులను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ ఎస్సీసెల్ నాయకులు కటకం జయరామయ్య, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, సంజీవయ్య, యువసేన అధ్యక్షులు పొట్లపూడి.రాజేష్, వైసీపీ నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, కౌన్సిలర్లు రవిబాబు, నాగార్జున, ఎస్ కె షబ్బీర్, బంగారుబాబు, నాయుడుపేట పట్టణ, రూరల్ సీఐలు సీహెచ్ ప్రభాకర్ రావు, సోమయ్య పాల్గొన్నారు.

అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అంధకారంలో ఉంటున్నాయి. మండల పరిషత్ కార్యాలయం, అగ్రికల్చర్, రైతు భరోసా కేంద్రం, ఉపాధి హామీ, వెలుగు కార్యాలయాల వద్ద కనీసం విద్యుత్తు దీపాలు లేకపోవడం దారుణం. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రుల్లో మందుబాబులు మద్యం తాగి సీసాలు పడేయడంతోపాటు మల,మూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ మార్గంలోనే బీసీ కాలనీ వాసులు వెళ్లాల్సి ఉంది. అధికారులు స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు ప్రాధాన్యమిచ్చింది టీడీపీనే: నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలకు సముచిత ప్రాధాన్యమిచ్చి ఆర్థిక చైతన్యవంతులుగా ఎదగడానికి బాటలు వేసింది తెలుగుదేశం పార్టీ నేనని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి పార్లమెంటు డివిజన్ నూతన తెలుగు మహిళ కమిటీని ప్రకటించారు. నూతన తెలుగు మహిళ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చక్రాల ఉష మట్టం శ్రావణి రెడ్డి, అధికార ప్రతినిధిగా పత్తిపాటి భారతి, దువ్వూరు బాలభారతి, తిరుపతి కార్యదర్శిగా అనిత, కడియాల భారతి, అరుణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, తొట్టంబేడు శాఖా గ్రంథాలయాల ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమకారులపై ప్రసంగాలు, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తకాలు తీసుకొని చాలా కాలం అయినా వారికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా తిరిగి తీసుకుంటారనీ, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తారకరామనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుతం'

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండలంలో 12,000 మందికి ఇంటి పట్టాలిచ్చామని.. జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అర్హులై సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వెంటనే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. రేణిగుంట మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డా॥బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీకి అడ్మిషన్లు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నరసింహులు తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, ఐటీ ఐ రెండు సంవత్సరాల కోర్సు పాసైన వారు, ఎన్ఐవోఎస్ పాసైనవారు డిగ్రీ లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ద్వితీయ, తతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి 15వ తేదీ ఆఖరని తెలిపారు. మరిన్ని వివరాలకు 9515401088, 9581628 409, 7382929641 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని కోరారు.

అంబలపూడిలో పడకేసిన అభివృద్ధి..!

- చినుకు పడితే రోడ్లన్నీ బురదమయం
- పూరిగుడిసెల్లోనే గిరిజనుల బతుకులు

ప్రజాశక్తి -బాలాయపల్లి: చినుకు పడితే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఇంట్లో నుంచి కాలు తీసి బయట పెట్టాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని అంబలపూడి గ్రామంలో వీధులు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు రోజూ వీధులను చూస్తున్నా సమస్యకు పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కనీస వసతులకు ప్రజలు నోచుకోవడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు లేకపోవడంతో అవస్థలు నిత్యకృత్యంగా మారాయి. మంచినీటి సరఫరా అంతంతమాత్రమే. అంతర్గత రహదారులన్నీ మట్టిరోడ్లుగానే దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే రోడ్లన్నీ చెరువులా మారుతున్నాయి. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ఈ రహదారుల్లో నడవలేక దళితవాడ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గిరిజనులకు..గుడిసెలే శరణ్యమా..?

తరాలు మారినా గిరిజనుల బతుకులు మారే పరిస్థితి కనిపించడం లేదు. అంబలిపుడి గిరిజన వాడ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో తలదాచుకోవాల్సిన పరిస్థితి. పక్కా గృహాలు మంజూరు కాకుండా గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అంబలపూడి గిరిజన కాలనీలో గుడిసెలు



బురదమయంగా ఉన్న వీధులు

చర్యలు తీసుకుంటాం:

అంబలపూడి గ్రామంలోని గిరిజనుల సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. జిల్లా ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి వెంటనే గిరిజనులకు న్యాయం చేస్తాం.

- వినిల్‌కుమార్, ఎంపీడీవో, బాలాయపల్లి

మమ్మల్ని పట్టించుకోండి



కాలనీ నిర్మించి సుమారు 40 సంవత్సరాలు దాటిపోయింది. ఇంతవరకు ఏ వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయలేదు. పేదవారిని పట్టించుకునే వారే లేరు. ఇళ్లల్లోకి వెళ్లాలంటే మోకాళ్ల లోతు నీళ్లలో నడిచిపోవాలి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. **- మాతయ్య, అంబలపూడి**

పక్కా గృహాలు మంజూరు చేయాలి



గిరిజనులు ఇళ్లలోకి నీళ్లు వచ్చేస్తే ప్రాథమిక పాఠశాలలో తల దాచుకోవాల్సిన పరిస్థితి. 4 ఏళ్ల క్రితం జిల్లా అధికారులు వచ్చారు. పక్కా గహాలు మంజూరు చేస్తామన్నారు. ఇంతవరకు చేయలేదు, మా గిరిజనులకు ఈ గుడిసెలే ఆధారం.

- వెంకటయ్య, అంబలిపూడి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా



గడపగడపకు కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి -పుత్తూరుటౌన్: ప్రభుత్వ పథకాలే జగనన్నకు శ్రీరామరక్ష అని.. ప్రతి ఇంటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడక్కుండానే సంక్షేమ పథకాలను అందించారని.. ఆయన్ను ప్రతిఒక్కరూ ఆశీర్వదించాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ఆదివారం పుత్తూరు మండలంలోని పరమేశ్వర మంగళం పంచాయతీలోని కైలాసపురం, జయరాణిపురం, కూర్మానికండ్రిగ, ఎన్టీఆర్ కాలనీల గ్రామాల్లో మంత్రి ఆధ్వర్యంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా.. లేదా ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని.. అవ్వాతాతలకు నెల ప్రారంభంలోనే వేకువజామునే క్రమంతప్పకుండా వాలంటీర్లతో పింఛను పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సర్పంచ్ మల్లిక, హరీష్, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చైనాతో మైత్రి సంబంధాలు ఏర్పడాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): భారత్- చైనాల మధ్య మైత్రి సంబంధాలు ఏర్పడి బలపడితే మన దేశంలో పేదరిక నిర్మూలన పూర్తి స్థాయిలో సాధ్యమవుతుందని, ఇందు కోసమే కోట్నిస్ ప్రయత్నించారని.. భారత్ సేన మిత్రమండలి సెక్రటరీ జనరల్ డాక్టర్ మోహన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు జతిన్ కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోట్నిస్ 112వ జయంతి సదస్సును ఆదివారం తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో నిర్వహించామన్నారు. రెండు దేశాల మధ్య వైరం కాకుండా మైత్రి సంబంధాలు ఉంటే ఆసియా శతాబ్దం అద్భుతంగా ఉంటుందన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పేద దేశాలుగా ఏర్పడిన చైనా, భారత్ లు ఒకేసారి స్వీయ ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నా రెండు మార్గాలలో పయనించాయని, సోషలిస్టు సమాజమే స్థాపనగా చైనా పరిపాలనను సాగిస్తూ నేడు ప్రపంచంలోనే పేదరిక నిర్మూలనలో అగ్రగామి దేశంగా పేరు గాంచిందన్నారు. మన భారతదేశంలో ఇప్పటికీ పేదరిక నిర్మూలన జరగలేదన్నారు. ఎక్కడో ఉన్న సామ్రాజ్యవాద దేశాలతో మన దేశ పాలకులు మైత్రి సంబంధాలను కోరుతున్నారని.. పక్క దేశమైన చైనాతో వైరాన్ని పెంచుకుంటున్నామని తెలిపారు. మన పాలకులు వారితో వ్యాపార సంబంధాలను కొనసాగిస్తున్నారన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 1938లో చైనాకు వెళ్లి సంస్కృతి సంబంధాలను మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. భారత్- చైనా మధ్య సర్వే నిర్వహించి ఇప్పటికైనా సరిహద్దు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటే వైరానికి తావుండదన్నారు. ఈనెల 20న విశాఖపట్నంలో భారత్ చైనా మిత్రమండలి ఆధ్వర్యంలో మహాసభలను నిర్వహిస్తున్నా మన్నారు. ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత్ చైనా మిత్రమండలిలో 15 వేల మంది సభ్యత్వాన్ని కలిగి ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీపీ మోహిత్ రెడ్డి


అభివృద్ధి పనులకు రూ.68 లక్షల మంజూరు



ప్రజాశక్తి - క్యాంపస్: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలని అభివద్ధికి చిరునామాగా చంద్రగిరి నియోజకవర్గం నిలుస్తోందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. సాయినగర్ పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సాయినగర్ పంచాయతీ పరిధిలోని సత్యసాయినగర్, సాయినగర్, ఎన్టీఆర్ కాలనీ, జయనగర్ కాలనీలలో పర్యటించారు. సర్పంచ్ డి.వి.రమణ ఆధ్వర్యంలో ఎంపీపీకి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి గడపలో మహిళలు ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు మోహిత్ రెడ్డికి హారతులు పట్టి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నమస్కరిస్తూ.. బాగున్నారా.. అంటూ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సకాలంలో అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. సమస్యలుంటే తెలపాలని కోరారు. స్పందించిన మహిళలు దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మంజూరు కావడం లేదని వాపోయారు. మరికొందరు ఇంటి పట్టాలు ఇచ్చారు గాని..స్థలాలు చూపలేదని వెల్లడించారు. స్పందించిన ఎంపీపీ పక్కనే ఉన్న అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డుల మంజూరులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తామని సమాధానం ఇచ్చారు. మరో రెండు వారాల్లో సమస్యను పరిష్కరించి తనకు సమాచారం ఇవ్వాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు ప్రజా రంజక పాలన సీఎం జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారని, ఆయన పాలనపై ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ డి.వి.రమణ, ఉప సర్పంచ్ సోమశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి, హేమలత, చెన్నారెడ్డి, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు శశిధర్ కృషి ఎనలేనిది

సంతాప సభలో సీనియర్ జర్నలిస్టులు



శశిధర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జర్నలిజం వత్తిలో 22 ఏళ్లపాటు నిబద్ధతతో పనిచేస్తూ సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడిన వ్యక్తిగా శశిధర్ పేరుగాంచారని ఆయన మృతి బాధాకరమని సీనియర్ జర్నలిస్టులు రాఘవశర్మ, గిరి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగళం గోపి, నరేంద్ర రెడ్డి, నగేష్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన శశిధర్ సంతాప సభలో జర్నలిస్టులు ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శశిధర్ చిత్రపటానికి జర్నలిస్టులు అంజలి ఘటించారు. నేడు సమాజంలో ఓ నిబద్ధతతో గుర్తింపు పొందిన వ్యక్తి అకారణంగా తనువు చాలించడం బాధాకరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. శశిధరపై మోపిన అభియోగాలలో ఏది వాస్తవం, ఏ మాత్రం సత్యాలను గుర్తించి అతని ఆత్మ శాంతికి జర్నలిస్టు సంఘాలు అందరూ కలిసికట్టుగా ఏకతాటిపై పోరాటం చేయాలని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. అవసరమైతే న్యాయ పోరాటానికి వెనుకాడమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కల్లుపల్లి సురేందర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలు, కోశాధికారి శ్రీకాంత్, గౌస్ బాషా, తులసి, శ్రీనివాసన్, రాధాకష్ణ, ప్రదీప్, ప్రవీణ్, శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు



రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసే వారే నిజమైన ప్రాణ దాతలని యువతరం సేవా సమితి సభ్యులు అన్నారు. ఆదివారం ఆ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు పక్కనున్న నిరాశ్రయుల వసతి గృహంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 70 మంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. యువ తరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తక్షణమే స్పందించిన అధికారులు





ప్రజాశక్తి -బిఎన్‌కండ్రిగ: మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు లైన్లపై పడటంతో సరఫరాకు ఆదివారం అంతరాయం కలిగింది. పెద్ద పాలేడు, ఆలత్తురు, గాజుల పెళ్లూరు, తలారివెట్టు తదితర గ్రామాలలో విద్యుత్తు తీగలు తెగి సరఫరా ఆగింది. తక్షణమే స్పందించిన అధికారులు సరఫరాకు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. నాలుగు విద్యుత్తు స్తంభాలు నేలకు ఒరిగాయి. వర్షాలకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్స్, స్తంభాల వద్దకు వెళ్లకుండా ఉండాలని ఏఈ పుణ్యకోటి తెలిపారు.

స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ రవిరాజు



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ రవిరాజును ఇండియన్ స్టేట్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నుకున్నారు. నంద్యాలలో జరుగుతున్న ఇండియన్ స్టేట్ మెడికల్ అసోసియేషన్ కార్యక్రమంలో 2023-2024 సంవత్సరానికి గాను స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా తనని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కోవిడ్‌లో రెండేళ్ళ అహర్నిశలు కషి చేసినందుకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున రెండు అవార్డులు అందుకున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి -రేణిగుంట: పట్టణంలోని ఎమ్మే జబ్బార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రస్టు అధినేత షేక్ ఫరీద్ బాబా సుమారు 28 మంది విశ్రాంత క్రీడాకారులు, విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. విశ్రాంత ఉద్యోగులు చేసిన సేవలను కొనియాడారు.

అనుమానాస్పద వ్యక్తిని పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి -చిల్లకూరు: చిల్లకూరు మండలం పరిధిలోని వల్లిపేడు గ్రామ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి తిరుగుతుండగా గ్రామస్థులు అనుమానంతో అతడిని పట్టుకుని చిల్లకూరు పోలీస్ స్టేషన్లో ఆదివారం అప్పగించారు. పోలీసులు అతడిని విచారిస్తున్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి - పెళ్లకూరు: మండలంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. చెరువులు బాగా నిండాయని తహసీల్దారు జై జై రావు తెలిపారు. చెరువులు గండ్లు పడే అవకాశం ఉందని.. చెరువులు , గుంటలు, కాలువల వద్ద పిల్లలు వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపుల ప్రభావం ఎక్కువగా ఉండి పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన యోగేష్

ప్రజాశక్తి - పెళ్లకూరు: మండలంలోని దిగువ చావాలి గ్రామం వద్ద ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకి వెళ్ళగా జీలపాటూరు పంచాయతీ దొడ్ల వారిమిట్ట గ్రామానికి చెందిన తిరుపతి యోగేష్(19), గోవిందు జగన్ (18)వ్యవసాయ పనులు ముగించుకొని నాయుడుపేటకు వెళ్లి నాయుడుపేట నుండి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా దొడ్లవారి మిట్ట గ్రామానికి చెందిన తిరుపతి వెంకటయ్య అమరావతుల కుమారుడు యోగేష్, చావాలి గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జగదీష్‌కు కుడికాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పెళ్లకూరు మండల ఎస్ఐ ఎం.మనోజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలో రెండు ప్రాంతాల్లో 15 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ మేడా సుందరరావు ఆదేశాల మేరకు రిజర్వు ఇన్‌స్పెక్టర్ అలీబాషా ఆధీనంలోని రెండు బృందాలు ఎస్ఆర్‌పాళ్యం సెక్షన్‌లోని రోళ్ల మడుగు బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున ఒక బృందం కుమారపెంట వద్ద కొందరు వ్యక్తులు ఎర్రదుంగలు మోసుకుని వెళుతూ కనపించారు. వీరిని చుట్టుముట్టేలోపు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో ఏడు ఎర్రచందనం దుంగలు లభించాయి. మరో బృందం చిన్నకోన అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా, ఎనిమిది ఎర్రచందనం దుంగలు లభించాయని వీటిని స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేసామన్నారు. పారిపోయిన వారి కోసం కూంబింగ్ ముమ్మరం చేశామని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.30లక్షల వరకు ఉంటుందని ఎస్పీ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి - ఏడుగురి అరెస్టు

ప్రజాశక్తి -దొరవారిసత్రం:తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండల పరిధిలోని నేలపట్టు గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న స్థావరాలపై శనివారం సాయంత్రం సమయంలో ఎస్ఐ తిరుమలరావు, వారి సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరాలపై దాడులు జరిపి పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట ఆడుతున్న ఆటగాళ్లను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న 11210 నగదును స్వాధీనం చేసుకొని, నగదును సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే చట్టానికి వ్యతిరేకమైన పనులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఎవరైనా పేకాట కోడి పందాలు ఇలాంటి ఆడినప్పుడు వెంటనే పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమనాడు పంచాయతీ సమీపంలో ఉన్న ఆర్చ్ దగ్గర నాయుడుపేట- పూతలపట్టు జాతి రహదారిలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం బైక్ ను ఢీ కొనడంతో ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రేణిగుంట మండలం వేణుగోపాల పురానికి చెందిన చిట్టేటి శంకర్ భార్య చంద్రకళ (30) సొంత పనిమీద శ్రీకాళహస్తికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలంలోనే మహిళ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. అలాగే మృతురాలి చిన్న కుమారుడు అరవింద్ కాలికి స్వల్ప గాయాలైనట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- కేవీబీపురం: కేవీబీపురం మండలంలోని అంజూరు గ్రామం నుంచి నెల్లూరుకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా..పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు కోవనూరు సమీపంలో బియ్యం తీసుకెళ్తున్న బొలేరో వ్యాన్‌ను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. 2500 కిలోల బియ్యంతోపాటు డ్రైవర్ మునేంద్రను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లోకనాథం, కానిస్టేబుల్ గంగాధరం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



రామచంద్రనాయుడిని సన్మానం చేస్తున్న వాకర్ సభ్యులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవ స్థాపకులు శ్రీనివాసులు రెడ్డి, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి రాజు అధ్యక్షతన ఎన్నికల అధికారి గాలి రమేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా రామచంద్రనాయుడు, కార్యదర్శిగా గోపికృష్ణ, రఘునాథరెడ్డి, కోశాధికారి గుణశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు కేకేసి కుప్పయ్య శెట్టి, రామ్మోహన్ వర్మ, రఫీ అహ్మద్, సుధాకర్, ద్వారకనాథ శెట్టి, ఆరుముగం, కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. అధ్యక్షులు రామచంద్ర నాయుడు మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్‌లో సొంతంగా వాకర్స్ భవనం లేదని అందరూ ఐక్యంతో వాకర్స్ భవనం నిర్మించుకున్నామని వాటిని అభివృద్ధికి సాయి శక్తులా కృషి చేస్తామని అన్నారు. భవనం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కృషి చేద్దామని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను ఘనంగా సన్మానం చేశారు. వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా, ఉద్యోగ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా అధ్యయన కేంద్ర రీడర్ డాక్టర్ డి.ఉమాదేవి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా 'ఉమెన్ ఎంపవర్మెంట్ - ప్రొటెన్షియాలిటీస్, ప్రాక్టికాలిటీ అండ్ ప్రొపౌండ్స్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో సగం మంది మహిళలు ఉన్నా.. విద్య, ఉద్యోగ అవకాశాలను అందుకోవడంలో వెనుకబడి ఉన్నారన్నారు. మహిళా అధ్యయన విభాగ కేంద్రం ఇన్‌ఛార్జి హెడ్ డాక్టర్ పి.నీరజ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ఏ విధంగా మహిళాభివద్ధికి ఉపయోగపడుతుందో మాట్లాడుకోవడం ఎంతో అవసరమన్నారు. మహిళా అధ్యయన విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.పి.మాధవి నేషనల్ ఎడ్యుకేషన్ డే-2022 థీమ్‌పై మాట్లాడారు. ఢిల్లీ యూనివర్సిటీ డీఏసీఈఈ హెడ్ ప్రొఫెసర్ రాజేష్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 మహిళా సాధికారత కోసం ఏ విధంగా పనిచేస్తుందో తెలిపారు. కార్యక్రమంలో ఫార్మర్ ఓఎస్‌డీ, ఎన్ఈపీ-2020 ఎంటఈ ప్రొఫెసర్ షకీలా శ్యామ్స్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.